మంచివాడు

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

గ్రామీణ జీవితంలో వస్తున్న పెనుమార్పులు, కొత్తగా వెలుస్తున్న ధనస్వాముల ప్రభావం వల్ల పరువు ప్రతిష్ఠలను నిలబెట్టుకోవాలని అనుకొనే నిజమైన పెద్ద మనుషులకు నిలువ నీడ లేకుండా పోతోంది.

ఇంకా పొద్దుగూకలేదు. పెదరెడ్డి కల్లాంకాడకి బయలుదేరాడు. చేతికి పొన్నుకర్ర. భుజం మీద ఎర్ర రంగు పైగుడ్డ. నల్లటి ఒళ్లు. ఇంతెత్తు మనిషి. వయసు మీదబడి కొంచెం నడుం వంచినా, పొన్నుకర్ర సాయంతో నిటారుగానే నడుస్తాడు.

పెదరెడ్డి ఒంట్లో నిస్సత్తువగా ఉంది. నిదానంగా, నీరసంగా నడుస్తున్నాడు. కపిల బావి దగ్గర కాటయ్య ఎదురుపడ్డాడు. పెదరెడ్డి అడుగుల్లో వడి పెరిగింది. వాడిన ముఖంలోకి దర్పం వచ్చింది. కాటయ్య పలకరించాడు.

“ఏం పెదరెడ్డీ, ఇంత పెందలకాడే బయిల్దేరినావు? నీకు ఏ కయ్యాలబడ్తే అదే లోకంగదా. మాపిటికి ఇంత కూడు దినేసి ఒకేతూరి బయిల్దేరుండగూడదా? ముద్దురెడ్డి కల్లాం మీద ఏ దొంగలు, తోడుబోతులు పడ్డారని ఇంత పొద్దుకాడే బయల్దేరినావు. నీబోటోడుండబట్టి గదా ముద్దురెడ్డి ఈ దినానికి ఇంత టోడు అయింది. సరేగానీ మనిషేందట్టుండావు. జెరం తగిల్నోడి మాదిరి. నందెకాడ అంత ముద్ద తినేసి గుట్టుగా నడుం వాల్చే రాత లేదు గదా నీకు.”

కాటయ్య మాటలు పట్టించుకోనట్టుగానే పెదరెడ్డి ముందుకు నడిచాడు. ఒంట్లోని నీరసాన్ని, ముఖంలోని దిగులును దాచడానికి పొన్నుకర్ర టకటకలాడించుకుంటూ గబగబా నడిచాడు.

కల్లాంకాడ జీలగ చెట్టు నీడలో కూర్చుని నాగయ్య బీడీ తాగుతున్నాడు. అల్లంత దూరాన పెదరెడ్డి కనబడగానే బీడీ ఆర్పేసి మిగిలిన ముక్క చెవి వెనుక దోపుకున్నాడు. లేచి వడ్లు కుప్పచేయడం మొదలుపెట్టాడు.

రోజూ కల్లాం మొత్తం కలదిరిగిగానీ నీడకు చేరని పెదరెడ్డి, ఈ రోజు నేరుగా జీలగచెట్టు కిందకి నడిచాడు. నులక మంచంమీద గోతాం పట్ట విదిలించి వేసి కూర్చున్నాడు. పొన్నుకర్రను భద్రంగా తన పక్కనే పెట్టుకున్నాడు.

“నాగా! ఆ పిచికల్ని అట్టగొట్టు. యామారినా మంటే వడ్లరాసంతా ముక్కన కరుసుకుబోతాయి,” అని పని పురమాయించాడు.

నాగయ్య పిచికల్ని అదిలించి వచ్చి రెడ్డిముందు నిలబడ్డాడు.

“బాయికాడికి బొయ్యి దబరనిండా నీళ్లు ముంచకరా బో,” అని చెప్పి, పైగుడ్డ చుట్టచుట్టి మంచం కోడు మీద దిండులాగా పెట్టుకుని పడుకున్నాడు. కళ్లు మూతలు పడుతున్నాయి. కడుపులో దేవినట్టుగా వుంది. తల వెనుక చేతులు పెట్టుకుని వెల్లికిలా పడుకుని పైకి చూశాడు. జీలగచెట్టు కొమ్మల్లో పసిరిక పాము కనిపించింది. వడ్లరాసిమీద పొల్లాడి పొల్లాడి అలసి వచ్చి వాలి సేదదీరుతున్న పిచ్చుక కోసం అది కాపేసుకుని ఉంది.

పెదరెడ్డి చివుక్కున లేచి పొన్నుకర్ర అందుకున్నాడు. ష్... ష్ అని అరుస్తూ కర్రతో కొమ్మలు కదిలించాడు. పిచ్చుక తుర్రున ఎగిరిపోయింది. పసిరిక పాము భయంతో ఇంకో కొమ్మ చాటుకి జారుకునింది. పెదరెడ్డి నిశ్చింతగా నులకమంచం మీద కూర్చున్నాడు.

నాగయ్య నీళ్లదబర తెచ్చి మంచం కింద పెట్టాడు. ఇత్తడి చెంబుతో నీళ్లు ముంచుకుని పెదరెడ్డి నోట్లో పోసుకున్నాడు. తొలిగుక్క గొంతులోకి దిగేట

ప్పటికి గుండె పట్టినట్టుగా అనిపించింది. నోటికాడి నుంచి చెంబు పక్కకి తీసేశాడు. గొంతులోని నీళ్లు కడుపులోకి జారాక నిదానంగా గుక్క గుక్కగా తాగాడు.

నాగయ్య విచ్రితపోయి చూస్తున్నాడు.

సేరు పాల చెంబు నోటికాడ పైకెత్తినాడంటే రెడ్డి ఖాళీ అయ్యేదాకా దించడు. అటువంటోడు ఈరోజు తులసి తీర్థం తాగినట్టుగా నిలిచి నిలిచి నీళ్లు తాగుతుండాడేందబ్బా అనుకుంటూ చూశాడు.

''నాగా, ఆ రెండు కువ్వలమీద గూడా గెడ్డి కప్పేసి నువ్వింక గుడిసికి పో,'' అని పెదరెడ్డి చెప్పాడు.

''నీకు మా పిటికి కూడెట్ట? తెచ్చిపెట్టేసి పోతాన్లే సామీ,'' అన్నాడు నాగయ్య.

''చెప్పింది చెవినేస్కో. కల్లాంకాడ నేనుంటాను గానీ నువు పో. ముద్దురెడ్డి పెళ్లాం కాడికి బొయ్యి కూలి డబ్బులు తీసుకోని పో. పోతా పోతా ఒక పొట్లాం పోసుకొని పొయ్యేవు. మక్కిలిరగతాయి. రూకలు పెళ్లాం చేతికిచ్చి అరువుగా ఇంత కాసుకుని తాగి గుట్టుగా పడుకో,'' అన్నాడు.

అయినా, నాగయ్య నసుగుతూనే నిలబడ్డాడు.

''నీకు మాపిటికి కూడు దెచ్చిపెట్టేసి పోతాన్లే సామీ,'' అన్నాడు.

''మళ్లీ అట్నే అంటావు. ఒకతూరి చెప్తే ఎక్కదేంది నీకు. కూటికేం కొల్లబోలేదు గానీ నువు పో. చినరెడ్డి తెస్తానన్నాడ్లే,'' అని విసుక్కుని నాగయ్యను పంపేశాడు.

పెదరెడ్డి మాటల్లో తొలి అబద్ధపు తడబాటు కనిపించింది.

నాగయ్య కదలకపోతే పెదరెడ్డి పెద్ద చిక్కులోనే పడేవాడు. కూటేళకి పనోడు గడపకాడికి వస్తే కడుపు నిండా పెట్టకుండా పంపే పద్ధతి పెదరెడ్డి ఇంటా వంటా లేదు. పెదరెడ్డి చిన్నతనంలో అయితే పొయ్యి మీద ఎప్పుడూ పనోళ్ల కోసమని పెద్ద దబర ఉడకతా ఉండేది. యాళకి వచ్చినవాళ్లకంతా వండి వార్చి వడ్డిస్తా ఉండేవాళ్లు. పెదరెడ్డి పెత్తనం వచ్చేప్పటికి అంత లేదుగానీ, పనోళ్ల కడుపుకింత పెట్టే ఆచారం మాత్రం మారలేదు. అందుకే పెదరెడ్డికి కూడు తేవడమంటే నాగయ్యకు అంత కుశాల.

కానీ, ఈరోజు పరిస్థితి వేరు. పొయ్యిలో నిప్పు కల్లు లేదు. తెల్లారి నుంచి ఇంట్లో ఎవ్వరూ ఇన్ని సద్దినీళ్లు కూడా గొంతులో పోసుకోలేదు. కూటేళకి యానాది నాగయ్య గడపకాడికి వస్తే ఏం పెట్టి పంపుతారు? ఇంట్లో పస్తుంటే వీధిలో తెలీదుగానీ, పనోడికి పెట్టకపోతే వీధంతా రచ్చే గదా!

పెదరెడ్డికి పేగుల్లో జ్వరం కాస్తున్నట్టుగా ఉంది. వడ్లబొట్ట ఖాళీ అయి నెల రోజులయింది. ఆ ఇంట్లో, ఈ ఇంట్లో అరువు తెచ్చుకుని కడుపు నింపుకుంటున్నారు. ఇదంతా కోడలి సమర్థత. ఈ రోజుటికి ఇంక అప్పు అడగడానికి ఇల్లే లేకపోయింది. ఒకతూరి అడిగిన వాళ్లనే అడగడానికి మనసు రావడం లేదు. కోడలు తన వల్ల కాదని తెగేసి చెప్పింది. పెదరెడ్డి పెట్టేవాడేగానీ, అడిగేవాడు కాదు. కొడుకు ఆ తండ్రి బిడ్డే. ఇద్దరు పసిబిడ్డల్ని చూస్తే మాత్రం కడుపు తరుక్కుపోతుంది.

ఈ నాలుగునాళ్లు గడిస్తే చాలు, పంట ముద్దురెడ్డి ఇంటికి చేరుతుంది. పెదరెడ్డి ఇంటికీ తిండి గింజలు వస్తాయి. కానీ, ఈ నాలుగు నాళ్లయినా గడిచేదెట్లా? ముద్దురెడ్డి ఊళ్లో లేడు. ముద్దురెడ్డి పెళ్లాం నోటి మనిషి. మంచీ మర్యాదా లేదు. తిండిగింజల కోసం ఆ యమ్మ దగ్గర మాటెవరు పడతారు!

నులకమంచం మీద పెదరెడ్డి అశాంతిగా కదిలాడు. కళ్ల మూతలు పడవు. బాధ కడుపులో సుళ్లు తిరుగుతూ వుంది. తెల్లారి నిద్రమంచం మీద ఉండగానే కొడుకు, కోడలి కొట్లాట చెవినబడింది.

''నువ్వూ మీ నాయినా ఏ ఏట్లోనన్నా పడి సావండి. నేను మాత్రం ఈ దినం ఒకరి గడప తొక్కేదిలా. ఒకర్ని దేబిరించేదిలా. చింతమాకులు మాదిరిగా ఇద్దరు మొగోళ్లు ఇంట్లో ఉండేదేమిటికి సుకం? పరువుకనీ పెతిష్టకనీ బొయి ఆడదాన్ని ఈదిలోకి పంపిస్తుండారే, ఎవురైనా ఇంటే మీ మొహాన కేకరించి ఊస్తారు.''

''మే, ఆడమేక మాదిరిగా గొంతు చించుకోబాక. నా మాటిను. ఈ నాలుగునాళ్లూ అట్ల గడవనీ. రామయ్యశెట్టి దెగ్గిరికి బొయ్యి బతిమాలో బంగపడో నాలుగు సేర్లు అప్పు దీసకరా బో,'' అని కొడుకు అడుగుతున్నాడు.

''నా పాణం బొయినా సరే, ఈ దినం ఒకర్ని అడిగేదిలా. పూటపూటా చేటెత్తుకొని గడప గడపా తిరిగే పని నాకేంటికి బట్టింది? మీ అబ్బా కొడకలలే ఈదిలోకి బొయ్యి ఇన్ని గింజలు తెచ్చిపొయ్యండి.''

''మే! ఇన్ని దినాలు ఒకరి ముందు చేతులు సాచి నోల్లం గాదు. ఈ ఒక్క దినం బిడ్డల మొహం జూసైనా ఇన్ని గింజలు దెచ్చి ఉడకేసిబెట్టు,'' అని కొడుకు బతిమాలుకుంటున్నాడు.

ఈ మాటతో కోడలు ఒంటికాలి మీద లేసింది.

''ముయ్యాట్ట నోరు. ఏం, బిడ్డల మొహం జూసేది నేనేనా, మీ అబ్బాకొడకలకి కళ్లు లేవా? బిడ్డల బాధ బట్టింది నాకేనా, మీ అబ్బా కొడకలకి బట్టదా? ఏ లగ్గాన మా వాళ్లు నన్నీ కొంపలో ఇచ్చినారోగానీ, ఏనాడైనా ఒక సుకమనేది ఎరుగుదునా? ఒక మిఠాయనీ, ఒక పండనీ

పలమనీ తిన్నానా? నా బిడ్డల కింత బెట్టానా? కడంత కాలం గొడ్డు మాదిరిగా చాకిరి చెయ్యమని గదా ఆ పాపిష్టి దేముడు నా నెత్తిన రాసినాడు.'' ఆమె ఆగ్రహం దుఃఖంగా మారింది. ఆమెను సముదాయించే మాటలేవీ అతని దగ్గర లేవు. కొంత మౌనం తరువాత తిరిగి ఆమే నోరు విప్పింది.

''పెగ్గిలికి బొయ్యి ఇంట్లోదంతా ఈదిలో బెట్టి పెళ్లాం బిడ్డల్ని పస్తులు బెడ్తుండారే మీ అబ్బా కొడకలు. బూమీ బుట్రా ఆ ముద్దురెడ్డి ఎదాన బెడ్తిరే. గుడికనీ బడికనీ, రాయికనీ రప్పకనీ నగానట్రా గూడా ఊడ్చి బెడ్తిరే. పెదరెడ్డి మంచోడనీ, చినరెడ్డి మంచోడనీ ఊళ్లో వాళ్లంతా నెత్తిన బెట్టుకుంటారని గదా మీరింత కాడికి జేసినారు! అక్కడికి పెదరెడ్డి కోడలే ఈ ఊళ్లోళ్లకి నోటిగల్ల మనిషి, పాపిష్టి ముండ అయింది. ఇద్దో... నేను గూడా పంటరెడ్డికి బుట్టిందాన్నే, నాగ్గూడా పరువుండాది, నాగ్గూడా రోసముండాది. పెళ్లాం బిడ్డల్ని సాక్కుంటారో సంపుకుంటారో నాకు తెలవదు. సందేళకంతా ఇన్ని గింజలు దెచ్చి ఇంట్లో బొయికపొయినారో నేనూ నా బిడ్డలూ ఏ బాయిలోనన్నా దూకి సస్తాం. అప్పుడు గూడా మీ అబ్బా కొడకలు మానం, మర్రేదా వడ్ల బొట్టలో బద్రంగా దాపెట్టుకోండి.''

కోడలి హెచ్చరిక మాటకి పెదరెడ్డి కలవర పడ్డాడు. భయమేసింది. గొంతు సవరించుకుని దగ్గాడు.

కోడలు పెళ్లోకి జారుకునింది. కొడుకు వీధిలోకి నడిచాడు.

పెదరెడ్డి పైటాలదాకా కల్లాంకాడ గడిపాడు. పొద్దు పడమటికి మళ్లాక ఇంటికి నడిచాడు. కోపంలో నాలుగు మాటలన్నా కోడలు మంచిది. బిడ్డల కోస మన్నా ఏ ఇంట్లోనో ఒకింట్లో నాలుగ్గింజలు తెచ్చి ఉడకేసి ఉండకపోతుందా అనుకున్నాడు. పెళ్లో బావి దగ్గరకు కాళ్లూ చేతులూ కడుక్కోవడానికి పోతూ వసారాలోని పొయ్యికేసి ఓరగా చూశాడు. బోర్లించిన కుండాచట్టీ బోర్లించినట్టే ఉన్నాయి. దిగులుతో, నిరాశతో కానుగుచెట్టు కింద నులక మంచం వాల్చు కుని పడుకున్నాడు. వసారాలో కోడలు, బిడ్డలు పడు కుని ఉన్నారు. కొడుకు ఇంట్లోలేడు. సందేళదాకా చూసి పొద్దుండగానే పెదరెడ్డి కల్లాంకాడకి బయల్దేరాడు.

పెదరెడ్డికి ఈ రోజు కూటికి తక్కువైనా మానానికి, మర్యాదకి తక్కువ లేదు. పేదవాడైనా పేరుకి, ప్రతిష్ఠకి తక్కువ లేదు. ఈ రోజుటికీ పోలూరుకి పెదరెడ్డి పెద రెడ్డే. తాతముత్తాతల నుంచి వారసత్వంగా లభించిన పరువు ప్రతిష్ఠలను పెదరెడ్డి కాపాడుకుంటూనే వున్నాడు. ఈ దినానికీ చెంగాళమ్మ జాతరకి తొలి పొటేలు పెదరెడ్డి ఇంటిముందు తెగాల్సిందే. మన్నారు స్వామి గుడిలో ముక్కోటి ఉత్సవానికి తొలి చందా పెద రెడ్డిదే. ఊళ్లో ఒక తగువు వచ్చినా, ఒక తంటా వచ్చినా పెదరెడ్డి మద్దిస్తం చెయ్యాల్సిందే. పెదరెడ్డి మాటకు తిరుగులేదు.

దానధర్మాలకు పెదరెడ్డి కుటుంబం పెట్టింది పేరు. 'పోలూరు పెదరెడ్డి అరిచ్చెంద్రుడు గదా,' అని ఈ చుట్టుపక్కల అంటారు. పెదరెడ్డి మంచితనాన్ని కీర్తించని వాళ్లు లేరు. పెదరెడ్డి తాతకి రెండొందల ఎకరాల భూమి ఉండేదంటారు. ఆయన్ని కూడా పెదరెడ్డి అనేవాళ్లు. తాత పేరు మనుమడికి పెట్టడం వాళ్ల వంశాచారం. పెదరెడ్డి నాయన పేరు చినరెడ్డి. అదే పేరు కొడుక్కి పెట్టుకున్నాడు. పెదరెడ్డి తాతను గురించి ఇప్పటికీ ఊళ్లో చెప్పుకుంటారు. ఆయన తవ్వించిన చెరువే ఊరికి ప్రాణం పోసిందంటారు. పెదరెడ్డి చెరువనే ఇప్పటికీ దాన్ని పిలుస్తారు. పెదరెడ్డి చిన్న తనంలో ఒకసారి ఊళ్లో నీళ్ల కరవు వచ్చింది. ఊరమ్మిడి బీళ్లన్నీ సాగులోకి రావడంతో పెదరెడ్డి చెరువు నీళ్లు సరిపోవడం లేదు. రైతులంతా చినరెడ్డే ఏదో ఒక ఆలోచన చెయ్యాలన్నారు.

చినరెడ్డి రెండో చెరువు తవ్వించే పని పెట్టు కున్నాడు. మంచి ఎండల కాలంలో పని. నాలుగ డగులు తవ్వేటప్పటికి బండ పడిపోయింది. చినరెడ్డి పని సగంలో ఆగేదానికి లేదు. కడప నుంచి వడ్డోళ్లు వచ్చారు. ఒకరా, ఇద్దరా? నూరు నూటయాభైమంది. పిల్లా జెల్లా, ముసలీ ముతకా వచ్చి దిగారు. మూడు నెలలు ఊళ్లో తిరణాల మాదిరిగా ఉండేది. వడ్డోళ్లకి కూడూ గుడ్డా, నీళ్లూ నిప్పు అంతా చినరెడ్డి చూసుకో వలసిందే. ఎర్రటెండలో వడ్డోళ్లు బండలు కొడుతూ ఉంటే వాళ్ల ఒంట్లో నుంచి చెమట కాలవలు కట్టి పారేది. పొద్దు పడమటకి మళ్లగానే పని ఆపేసేవాళ్లు. టెంకాయకల్లు బానలు వచ్చి దిగేవి. తాగినంత కల్లు. నాలుగు రోజులకు ఒకసారి అయిదో ఆరో పొటేళ్లు తెగేవి. చెరువుపని పూర్తయ్యేటప్పటికి చినరెడ్డి మందలో కాలు భాగం జీవాలు కూడా మిగల్లేదు. కూలి డబ్బుల మాట కాదుగానీ, చినరెడ్డి పెట్టిన తిండి గురించి, పోసిన కల్లు గురించి కడప పక్క వడ్డోళ్లు ఈ రోజుటికీ చెప్పు కుంటారు. చినరెడ్డికి అదే సంతోషం. చినరెడ్డి చెరువు పూర్తయి పెదరెడ్డి చేతికి పెత్తనం వచ్చేటప్పటికి మిగి లింది పాతిక ఎకరాల నేల మాత్రమే. పెదరెడ్డి అందుకు చింతించలేదు. వంశపారంపర్యంగా వచ్చిన పేరు ప్రతిష్ఠలను కాపాడుకోవడానికి ఆయన చేయగలిగిం దంతా చేస్తూనే ఉన్నాడు.

ఒకసారి కచ్చేరి స్కూలు వార్షికోత్సవం జరిగింది. డి.ఇ.ఒ. వచ్చాడు. వేదిక మీద పెదరెడ్డి కూడా కూర్చు న్నాడు. పెదరెడ్డి లాంటి మంచి మనుషులున్న ఊళ్లో స్కూలుకు సొంత బిల్డింగు లేకపోవడం అవమానమని, యాభైవేలు ఊళ్లో వాళ్లు పెట్టుకుంటే మిగతా మొత్తం గవర్నమెంటు ఇస్తుందని, బిల్డింగ్ కట్టుకోవచ్చని డి.ఇ.ఒ. చెప్పాడు. ఆ పనికి పెదరెడ్డి పూనుకుని యాభై వేలు వసూలు చేయాలని కోరాడు. ఒక మంచి పనికి పెదరెడ్డి ఇంకొకరి ముందు చేతులు చాస్తాడా! యాభై వేలు తనే కడ్తానన్నాడు. భవన నిర్మాణ బాధ్యత కూడా పెదరెడ్డి మీదే పెట్టారు, కాంట్రాక్టర్లయితే కట్టుబడి గట్టిగా ఉండదని. పెదరెడ్డి పనంటే మాటలు కాదు గదా! భవనం పూర్తయ్యేప్పటికి ఖర్చు రెండింతలైంది. చెరువుకింద నేల ఏడెకరాలు ముద్దురెడ్డికి అమ్మాల్సి వచ్చింది.

ఇంకొకసారి మన్నారుస్వామి గుడి గోపురం బాగా దెబ్బతినింది. గుడి కమిటీకి పెదరెడ్డి ఛైర్మన్. మాట పడకూడదు గదా! రిపేర్లు పెట్టుకున్నాడు. అయిదె కరాలు ఖాళీ. పెదరెడ్డి పనులకు చినరెడ్డి కూడా ఎప్పుడూ అడ్డు చెప్పి ఎరుగడు కానీ, కన్నతల్లి, తోడ బుట్టిన తమ్ముడు చచ్చిపోయినప్పుడు మాత్రం గుండె కలుక్కుమనింది.

పెదరెడ్డికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కూతుర్ని నెల్లూర్లో ఉద్యోగస్థుడికి ఇచ్చాడు. మాన మర్యాదల మీద బతికే మనిషి కట్నకానుకలకు తక్కువ చేస్తాడా! పెళ్లి వైభవంగా జరిపించాడు. నిన్న మొన్నటి దాకా కూతురూ, అల్లుడు, వాళ్ల బిడ్డలు పోలూర్లో నెలకు వారం రోజులైనా గడిపేవాళ్లు. ఆఖరి అయిదెకరాల నేలా నాయుడుపేట బ్యాంకోళ్లు జప్తు చేసినప్పటి నుంచి రాకపోకల్లేవు.

పెదరెడ్డి పెళ్లాం మొగుడు మాట మీరిన మనిషి కాదు. ఇంటెడు చాకిరి నెత్తినేసుకుని పనోళ్లని, పరా యోళ్లని లేకుండా వండి వార్చి వడ్డించేది. సంసార మన్నాక సవాలక్ష సమస్యలుంటాయి. బతుకన్నాక బాధలు తప్పవు. ఇంటి కష్టాలు వీధిలో పెట్టేదికాదు. చినరెడ్డి పెళ్లాంలాగా భర్తని నసపెట్టి ఎరుగదు. ఒంటి మీద నగానట్రా మొత్తం దానధర్మాల కింద పోయినా, మొగుడ్ని నిలదీసిన మనిషికాదు. చిన్నకొడుకు చచ్చి పోయిననాడు కూడా మొగుడ్ని నిలదీసిన మనిషి కాదు. తన కర్మనే నిందించుకునింది. పెద్దకొడుకు సేద్యంలోకి దిగినా, చిన్నకొడుకు చదువు మానలేదు. ఇంటర్ పాసై బెంగుళూరులో ఇంజనీరింగ్ చదవాలన్నాడు. కొడుకు ఇంజనీరు అయితే పెదరెడ్డికి గొప్పే కదా! అయిదెకరాల నేల అమ్మి, లక్ష రూపాయలు డొనేషన్ కట్టి కాలేజీలో చేర్పించాడు. కాలేజీలో చేర్పించాడుగానీ కూటికీ, గుడ్డకీ అంత ఖర్చవుతుందని అనుకోలేదు. నెలకు ఆరేడొం దలు పంపాల్సి వచ్చేది. రైతు నెల జీతగాడు కాదుగదా? ఫలితం చేతికొచ్చిన రోజుల్లోతప్ప డబ్బెక్కడ వుంటుంది? ముద్దురెడ్డిని అడిగినపుడంతా కాదన కుండా అడిగినంత ఇచ్చేవాడు. మూడేళ్లు గడిచాయి. అప్పు కొండంత అయింది. ఎన్ని పుట్లు వడ్లు పండితే ముద్దురెడ్డి బాకీ తీరేది? మానం కాపాడుకోవాలంటే భూమి అమ్మక తప్పదు. ముద్దురెడ్డే అయిదెకరాలు కొన్నాడు.

నాలుగో ఏడు చిన్న కొడుక్కి డబ్బు పంపడం కష్ట మైంది. వానల్లేక సగం పంట కూడా చేతికి రాలేదు. బాకీలకే అది చాల్లేదు. మిగిలిన మూడెకరాలు అడు మానంలో ఉంది. కొత్తగా అప్పు ఎవర్నని అడుగుతాడు? కొడుక్కి డబ్బు పంపి మూడు నెలలయింది. జాబుల మీద జాబులు వస్తున్నాయి.

ఫీజు కట్టలేదని హాస్టల్లో పేరు తీసేయడంతో పెదరెడ్డి కొడుక్కి అవమానం అయిపోయింది. హాస్టల్ రూంలో ఫ్యానుకి ఉరేసుకుని చచ్చిపోయాడు.

బెంగుళూరు నుంచి ఇంజనీరై వస్తాడనుకున్న కొడుకు పీనిగై ఇల్లు చేరడంతో తల్లి తట్టుకోలేకపో యింది. ఆ దిగులు దిగులు ఆమెను వెంటబెట్టుకునే పోయింది.

పెళ్లాం శవం నడింట్లో ఉన్న రోజున పెదరెడ్డి చేతిలో చిల్లిగవ్వ లేదు. ముద్దురెడ్డి ముందుకు వచ్చి ఆదుకున్నాడు. కర్మ ఘనంగా జరిగింది. తల గొడుగు లకి రెండు పొటేళ్లు తెగాయి. పెదరెడ్డి ఇంట్లో కార్య మంటే మాటలు కాదుగదా!

ఇంక మిగిలిన మూడెకరాల నేలమీది ఫలితమే పెదరెడ్డి కుటుంబానికి ఆధారం అయింది. అయినా, ఊళ్లో మంచిచెడ్డలకి పెద్దరెడ్డి ముందుంటూనే వున్నాడు.

ఇంటి బాధ్యత కోడలి మీద పడింది. పెళ్లాం పెదవి దాటేది కాదు గానీ, కోడలిది ఒకటే నస. బాకీ కట్టి కక్కాలంటూ నాయుడుపేట బ్యాంకోళ్లు వచ్చి నెత్తిన కూర్చున్నారు. మిగిలిన నేల కూడా పోయింది.

పెదరెడ్డి కిపుడు భూములు, బావుల్లేవు.

ముద్దురెడ్డి సలహా ఇచ్చాడు. ''పెదన్నా, నువు మా నాయినలాంటోడివి. నీది పెద్దచెయ్యి. నా సేద్య మంతా నీ చేతిమీదే జరగనీ. పంట చేతికందినాక తిండి గింజలకి లోటు లేకుండా ఇంటికి చేరస్తా. నీ కొడుకుని యాడైనా రెండెకరాలు కోరిక్కి జేసుకోమను. దిగు లుండదు.''

ఎదురు చెప్పడానికేముంది? సమితి రాజకీయాల్లో తీరిక లేని ముద్దురెడ్డికి భూములు, బావులు చూచుకోవడానికి పెదరెడ్డికన్నా మంచి మనిషి ఎక్కడ దొరుకుతాడు?

పెదరెడ్డి చేతికింద సేద్యం అంటే పనుల కాలంలో మనుషులకి కొదవ ఉండదు. పంటల కాలంలో కల్లాం మీద ఈగయినా వాలదు. ఎన్ని వేలు పోస్తే మటుకు ఇంత మంచి సేద్యగాడు ముద్దురెడ్డికి దొరుకుతాడు?

అయినా, పెదరెడ్డిని సేద్యగాడుగా ముద్దురెడ్డి గానీ, ఊళ్లోవాళ్లుగానీ ఏనాడూ చూడరు. ఆయన మంచితనాన్ని మన్నించేవాళ్లే కానీ, తాతతండ్రుల మాదిరిగా తన పేరు నిలిచిపోయే పనేదీ చెయ్యలేక పోయాననే అనేది పెదరెడ్డి దిగులంతా.

గతకాలపు ఆలోచనలతో మగన్నుగా ఉన్న పెదరెడ్డి ఏదో అలికిడికి కళ్లు తెరిచాడు. వడ్లు కలబెడుతున్నట్లు కసకస శబ్దం వినబడింది. పొన్నుకర్ర అందుకుని లేచి కూర్చున్నాడు. వడ్లకుప్ప వెనుక కదలిక తెలుస్తోంది. చెప్పులు వేసుకోకుండా నెమ్మదిగా నడిచాడు.

గోతాం సంచిలోకి ఎవరో వడ్లు తోసుకుంటున్నారు. పెదరెడ్డి ఒంట్లో నెత్తురు వేడెక్కింది. కోపంతో ఒళ్లు బిగుసుకునింది. కొత్త శక్తి ఏదో శరీరంలోకి ప్రవేశించినట్లయింది. పొన్నుకర్రను చేతివేళ్లు ఒడిపిపట్టుకున్నాయి. అమాంతం దొంగ మీద పడి పట్టుకున్నాడు.

పెనగులాటలో దొంగ వెనుతిరిగి చూశాడు.

పెదరెడ్డి నివ్వెరపోయాడు. ఒంట్లోని నెత్తురంతా హఠాత్తుగా హరించుకుపోయినట్లయింది. ఒళ్లు చల్లబడిపోయింది. పొన్నుకర్ర జారి నేలమీద పడింది. ముడతలు పడ్డ ముఖం చిగురుటాకులా వణకడం మసక వెన్నెలలోనూ స్పష్టంగా కనిపించింది.

అతికష్టం మీద పెదరెడ్డి పెదాలు కదిపాడు.

"చిన్నోడా," అన్నాడు, అంతకు మించి ఇంకొక్క మాట కూడా మాట్లాడే శక్తి లేనట్టు. ఆ ఒక్క మాటలోనే నమ్మలేనితనము, అవమానము ధ్వనించాయి.

"రాజమ్మ చెప్పింది. బిడ్డలు... ఆకిలి..." అని చినరెడ్డి అన్నాడు. తప్పుచేసినతనం, భయం చినరెడ్డి మాటల్ని మింగేశాయి. అయినా, పెదరెడ్డికి అంతా అర్థమయింది. రోషం కోపం తన్నుకు వచ్చాయి. చివుక్కున లేచి చినరెడ్డిని ఒక్క తోపు తోశాడు.

"ఆడదాని మాటిని ఈ పాపిష్టి పనికొచ్చావా? ఎంత అప్రెదిష్ఠ? పెదరెడ్డి ఇంట బుట్టి మానం చెడ్డపని జేస్తావా? మీ తాతముత్తాతల కాలం నుంచీ ఒక మచ్చ ఎరుగుదుమా, ఒక మాట పడుదుమా? నిప్పంటి వంశంలో పుట్టి నీతిమాలిన పనిజేస్తావా? ఒక్కపూట పస్తుండలేకపోయినావంటరా యెదవా! వందల ఎకరాలు పోయినా, నీ తాతముత్తాతలు ఎంటికితో సమానం అనుకున్నారే. నీమాదిరి మానం తప్పినా రంట్రా," అన్నాడు పెదరెడ్డి.

"నాయినా, నేను జెప్పేదిను. పెదమ్మి శోషొచ్చి పడిపోయింది. చినమ్మి సందేళ నుంచి ఒకటే ఏడుపు. బిడ్డల బాధ కళ్లజూళ్లేక వొచ్చినా. నాలుగ్గింజలు తీసక బోతా. రాజమ్మ దంచి ఉడకేసి బిడ్డకన్నా బెడ్తాది."

చినరెడ్డి మాటలకు పెదరెడ్డి కొంత కరిగాడు.

'రే చిన్నోడా, ఏమన్నా మానంగా మాట్లాడ్తుండావా నువ్వు! ఎవురైనా జూస్తే ఇంకేమన్నా ఉండాదా! పరువూ మర్రేదా ఈ ఒక్క దినంలో చెరువులో కలవదా! మనిషన్నోడికి కడుపే కైలాసంగాదు. మాట, మంచి, మర్రేద ఉండాలి. నా మాటిని ఇంటికి బో. తెల్లారి యాడ్నో ఒక దెగ్గిర నేనే నాలుగ్గింజలు తెస్తా" అని అనునయంగా చెప్పాడు.

చినరెడ్డి వినలేదు. "నాయినా, నా మాటిను. జరుగు. బిడ్డలు ఆకిలితో అల్లాడతా ఉండారు. నాలుగ్గింజలే గదా! పెదరెడ్డి కూట్నీళ్లకు కొట్టేసిన మన బూమి పలితమే గదా ఇది" అని గోతాం నెత్తికెత్తుకున్నాడు.

పెదరెడ్డి ఆగ్రహంతో చినరెడ్డి నెత్తిమీద మూటని ఒడిసి పట్టుకుని అరిచాడు.

'రే చిన్నోడా! నీకీ పూట దెయ్యం బట్టింది. నీతో మాట గాదు. మర్రేదగా మూట కింద పారేసి పో" అని మూట లాక్కునే ప్రయత్నం చేశాడు.

పెదరెడ్డికి, చినరెడ్డికి మధ్య పెనగులాట జరిగింది. పెదరెడ్డి ఆగ్రహంతో రొప్పుతున్నాడు. ఆవేశంతో ఆయన శరీరం వణకిపోతూ ఉంది. పిల్లల్ని కాపాడుకోవడానికి గద్దతో పోట్లాటకి సిద్ధమైన తల్లికోడిలా వున్నాడు.

ఎర్రబారిన పెదరెడ్డి కళ్లలోని పట్టుదలను చూశాడు చినరెడ్డి. నెత్తిమీద మూటను విసిరి నేలకేసి కొట్టాడు. తండ్రివైపు తిరిగి 'థుపూ'మని ముఖాన కేకరించి ఉమ్మేసి ఊరివైపు పరుగెత్తాడు.

మసక వెన్నెలలో కోతలు పూర్తయిన వరిపొలాల మీద పడి పరుగెత్తుతున్న చినరెడ్డికి, 'ఒరే కొడకల్లారా... నేను మంచోణ్ణిగాదురా. నాకు మానం, మర్రేదా వొద్దురా,' అని గొంతు పగిలేలా అరవాలనిపించింది. కానీ, మాట పెగలి పెదవి దాటి రాలేదు.

ఇండియా టుడే పక్షపత్రిక, సెప్టెంబర్ 21 - అక్టోబర్ 5, 1993